www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 5 ఫిబ్రవరి 2025



షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్‌లో యూసఫ్‌కు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణానికి చెందిన షూటింగ్ బాల్ క్రీడాకారుడు మొహమ్మద్ యూసఫ్ బాష రెండవ ఆసియన్ షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై విజయం సాధించి భారత్ తరపున గోల్డ్ మెడల్ సాధించాడు. 2వ ఆసియన్ ఛాంపియన్ షిప్‌లో భారత పురుషులు, మహిళల జట్లు గోల్డ్ మెడల్ సాధించాయి. భారత పురుషుల జట్టులో యూసఫ్, మహిళల జట్టు మేనేజరుగా పరశురాం గోల్డ్ మెడల్ సాధించిన టీంలో ఉండటం సంతోషంగా ఉందని జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు గోల్డెన్ వ్యాలీ రమణారెడ్డి, కార్యదర్శి గౌతమి నరేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనివాస్,సాగర్,కోశాధికారి సాయిశేఖర్ రెడ్డి, సభ్యులు నాగేంద్ర ప్రసాద్, పవన్, సురేష్, సయ్యద్ బాషా, మురళీ, భారతిలు అభినందించారు.



పతకాలతో యూసఫ్ బాష, పరుశురాం

వెలిగల్లు లిఫ్ట్ పనులకు బ్రేక్

రూ.90 కోట్ల పనులకు రారాం
భూసేకరణకు అంతులేని నిర్లక్ష్యం
2,500 ఎకరాల స్థిరీకరణకు గ్రహణం



వెలిగల్లు లిఫ్ట్ పనులకు గ్రహణం పట్టింది. అన్నమయ్య జిల్లాలోనే తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను గాలివీడు మండలం ఎదుర్కొంటోంది. క్షామ పీడిత మండలలోని 30 చెరువులకు ఎత్తిపోతల ద్వారా సుమారు రెండు టిఎంసిలను ఎత్తిపోయాల్సి ఉంది. 2,500 ఎకరాలను స్థిరీకరించాలనే ప్రభుత్వ ఉద్దేశం. గత వైసిపి ప్రభుత్వం భూసేకరణ, పరిహారం చెల్లింపులు చేయడంలో చేసిన తాత్సారం గాలివీడు మండల రైతాంగానికి శరాఘాతంగా మారింది. కాంట్రాక్ట్ సంస్థ భూసేకరణ పనులు పూర్తి చేయని నేపథ్యంలో ఎత్తిపోతల పనులు చేపట్టలేమని పేర్కొంటూ లేఖ రాసింది. స్పందించిన రాష్ట్ర జలవనరులశాఖ డిసెంబర్‌లో క్లోజింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ పరిధిలోని వెలిగల్లు లిఫ్ట్ పనులు టెండరు దశను దాటలేదు. 2021లో జిల్లా జలవనరుల శాఖ రూ.90 కోట్లతో కూడిన వెలిగల్లు లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు టెండరు పిలిచింది. నార్-పోయా కాంట్రాక్టు సంస్థలు సంయుక్తంగా టెండరును దక్కించుకున్నాయి. అగ్రిమెంట్ కుదుర్చుకున్నాయి. టెండరు అగ్రిమెంట్ ప్రకారం జలవనరుల శాఖ 34 ఎకరాల భూసేకరణ చేసి భూములు అప్పగించాల్సి ఉంది. జిల్లా జలవనరులశాఖ 34 ఎకరాలను సర్వే చేసి, అర్హులైన రైతులను సైతం గుర్తించింది. ప్రభుత్వ భూమి ఆరు ఎకరాలు, ఫారెస్టు భూమి రెండు ఎకరాల, మిగిలిన 24 ఎకరాలు డికెటి, ఇతర పట్టా భూములు ఉన్నట్లు తేల్చింది. రూ.6 కోట్లు పరిహారానికి నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. భూములు కోల్పోతున్న రైతులకు నాలుగేళ్లుగా పరిహారం నిధులు విడుదల చేసిన పాపాన పోలేదు. ఫలితంగా సదరు కాంట్రాక్టు సంస్థలు ఎత్తిపోతల పనులు చేపట్టడం సాధ్యంకాదని తేల్చిచెప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎత్తిపోతల పనుల కాంట్రాక్టును క్లోజ్ చేయాలని కోరుతూ జలవనరుల శాఖను కోరింది. జిల్లా జలవనరుల శాఖ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. 2024 డిసెంబర్‌లో కాంట్రాక్టును రద్దు చేసినట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ప్రభుత్వ అసమర్థ నిర్వాకం ఏటా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న గాలివీడు మండల రైతాంగం ఆశలపై నీళ్లు చల్లడం తీవ్ర నిరాశను కలిగించింది. దీనిపై వెలిగల్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను సంప్రదించగా వెలిగల్లు ఎత్తిపోతల పనులను రద్దు చేసిన మాట వాస్తవమేనని అంగీకరించడం గమనార్హం. పరిహారం నిధుల ప్రతిపాదనలు ప్రభుత్వం దగ్గరే ఉన్నాయని పేర్కొనడం గమనార్హం.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఉద్యాన కళాశాల విసి డాక్టర్ కె.గోపాల్
- అట్టహాసంగా ప్రారంభమైన అంతర్ జిల్లాల క్రీడా పోటీలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, నైపుణ్యాలు పెంచుకొని ఉన్నత స్థానాలకు చేరాలని వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ అన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల 11వ క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు మంగళవారం అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు విసి గోపాల్, విశిష్ట అతిథిగా రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే హాజరయ్యారు. ఈ పోటీలను ప్రారంభించిన విసి గోపాల్ తన ప్రసంగంలో క్రీడల ఆవశ్యకత వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రీడలు కూడా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసం, సమగ్రత పెంపొందుతాయన్నారు. విద్యార్థులు అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తారన్నారు. ఉద్యాన విద్యార్థులు చదువు, పరిశోధనలకే పరిమితం కాకుండా క్రీడలలోను పాల్గొనాలని సూచించారు. క్రీడాకారులకు ఉన్నత విద్య, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకోవాలని కోరారు. ఉద్యాన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని వర్సిటీ అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వర్సిటీలకి త్వరలోనే ఆర్‌కెవివై పథకం క్రింద పరిశోధన ప్రాజెక్ట్ నిధులు వస్తాయని చెప్పారు. రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. క్రీడల్లో తరచు పాల్గొనాలని సూచించారు. తాను కూడా వ్యవసాయ విద్యార్థినేనన్నారు. కళాశాలలో చదివే రోజుల్లోనే విద్యార్థులు భవిష్యత్ ప్రణాళిక రూపొందించుకొని ఆదిశగా ప్రయత్నం చేయలన్నారు. డ్రగ్స్, ర్యాగింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. సోషియల్ మీడియా, సాంకేతికతలను ఉన్నత స్థానాలకు ఎదగడానికి సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. డిఎస్‌ఎ డాక్టర్ ఎస్.సూర్యకుమారి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో అదనపు నైపుణ్యాలు లభిస్తాయన్నారు. వీటి ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్వాంతన లభిస్తుందన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.టి.శ్రీనివాస్ ప్రసంగిస్తూ ఈ పోటీలకు 9 కళాశాలల నుంచి 450 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీల్లో విద్యార్థుల అత్యున్నత నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో సిఇఒ ప్రసన్నకుమార్, వెంకటరామన్నగూడెం, పులివెందుల ఉద్యాన కళాశాలల అసోసియేట్ డీన్లు డాక్టర్ దొరార్జీరావు, డాక్టర్ ఆర్.నాగరాజు, ఒఎస్‌ఎ డాక్టర్ సయ్యద్ సదరున్నీషా ప్రసంగించారు. అనంతరం క్రీడా జ్యోతిని విసి గోపాల్, ఎఎస్‌పి మనోజ్‌కుమార్ హెగ్డేలు వెలిగించి క్రీడాకారులకు అందచేశారు. అనంతరం క్రీడాకారులు క్రీడా జ్యోతితో ప్రదర్శన చేశారు. క్రీడ, సాంస్కృతిక, సాహిత్య పోటీలు శుక్రవారం వరకు నాలుగు రోజులు పాటు కొనసాగనున్నాయి. శుక్రవారం సాయంత్రం నిర్వహించే ముగింపు కార్యక్రమంలో ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో పీడీ వై.రవిశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న విసి డాక్టర్ కె.గోపాల్, ఎఎస్‌పి హెగ్డే

పరుగు పందెంలో విజేతలకు బహుమతులు

మండలంలోని అనంతరాజుపేట వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన 800 మీటర్ల బాలుర పరుగు పందెం పోటీలో అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థి తేజ మొదటి బహుమతి, రెండవ బహుమతి వెంకటరామన్నగూడెం కళాశాలకు చెందిన విజయ్, మూడవ బహుమతి అనంతరాజుపేట ఉద్యాన కళాశాలకు చెందిన గణేష్, బాలికల విభాగంలో మొదటి బహుమతి చిన్నలతెరపి కళాశాలకు చెందిన సమీరా, రెండవ బహుమతి వెంకట రామన్నగూడెం కళాశాలకు చెందిన యమున, మూడవ బహుమతి అనంతరాజుపేట కళాశాలకు చెందిన హారిక దక్కించుకున్నారు. పరుగు పందెంలో విజేతలకు విసి గోపాల్, ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే మెడల్స్, బహుమతులు అందజేశారు.



800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో బాలుర విభాగంలో విజేతలు



800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో బాలికల విభాగంలో విజేతలు

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

రెవెన్యూ సదస్సులు, పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో తహశీల్దార్లు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీ సర్వే, రెవెన్యూ సదస్సుల అర్జీలు, పిజిఆర్ఎస్ అర్జీలు, భూసేకరణ, తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాలా మండలాలలో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాటినే త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రీ సర్వే గురించి మాట్లాడుతూ మండల సర్వేయర్లు అందరూ దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న రీ సర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతివారం ఎంపిడిఒలు, తహశీల్దార్లతో ఈ అంశాలపై సమీక్ష నిర్వహించి పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, సర్వే శాఖ ఏడీ, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో రాణించిన చిన్నారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణానికి చెందిన లక్ష్మీ స్నేహిత, శౌర్యసింహ వర్మ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో రాణించి బంగారు పతకాలు సాధించినట్లు వి.కె. స్కేటింగ్ అకాడమీ కోచ్ వినోద్ కుమార్ తెలిపారు. జనవరి 31 నుంచి మూడు రోజుల పాటు తమిళనాడు రాష్ట్రం మదురైలో నిర్వహించిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో లక్ష్మీ స్నేహిత అండర్-4 విభాగంలో 200 మీటర్ల క్యాడ్లే రేస్ పోటీలో, శౌర్యసింహ వర్మ అండర్-6 విభాగంలో 200 మీటర్ల రిలే రేస్ పోటీలో బంగారు పతకాలు సాధించారని తెలిపారు. గత నెలలో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో లక్ష్మీ స్నేహిత 200 మీటర్ల విభా గంలో రజత పతకం, 400 మీటర్ల విభాగంలో స్వర్ణ పతకం సాధించిందన్నారు. శౌర్య సింహ వర్మ 200 మీటర్ల విభాగంలో రజతం, 400 మీటర్ల విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. అండర్-8 విభాగంలో తేజ సాయి 200 మీటర్ల విభాగంలో రజతం, 400 మీటర్ల విభాగంలో స్వర్ణ పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభకనబరిచిన వీరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని, జాతీయ స్థాయిలో తమ సత్తా చాటుకున్నారని తెలియజేశారు.



పతకం సాధించిన లక్ష్మీ స్నేహిత

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి- రామాపురం

ద్విచక్ర వాహనదారులు సురక్షితంగా ప్రయాణించాలంటే హెల్మెట్ తప్పనిసారిగా ధరించి వాహనాన్ని నడపాలని ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్ వద్ద వాహనానల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపిన వారికి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టు వీలర్ నడిపేటప్పుడు తప్పనిసరి హెల్మెట్ ధరించాలన్నారు. ఫోర్ వీలర్ వెహికల్స్ భారీ వాహనాలు డ్రైవర్లు సీట్ బెల్ట్ తప్పనిసరి ధరించాలి అన్నారు వాహనాలు నడిపేటప్పుడు అనుకోని సంఘటన జరిగితే ప్రాణాపాయం నుండి మిమ్మల్ని రక్షించేది హెల్మెట్, సీట్ బెల్ట్ అన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి

విదేశీ బీమా కంపెనీలు దేశ భద్రతకు ముప్పు

- నిరసనలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

విదేశీ కంపెనీలు దేశ భద్రతకు, ప్రజల సమాచార గోప్యతకు ముప్పు అని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. దేశవ్యాప్త పిలుపుమేరకు డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో కేంద్ర బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన మేరకు బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడం తగదని అన్నారు. ఎల్ఐసి ఏజెంట్ల తో, పెన్షనర్లతో కలిసి నిర్వహించిన నిరసన సందరేగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను నేరుగా ఆహ్వానించడంతో బీమారంగానికి, పాలసీదారులకు మేలు చేయదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు బీమా రక్షణను విస్తరింపజేసి పాలసీదారులకు సకాలంలో చెల్లింపులు చేస్తూ దేశాభివృద్ధికి నిధులను అందిస్తున్న ఎల్ఐసి కి స్వయం ప్రతిపత్తి ఇవ్వాల్సి ఉండగా, కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని అన్నారు. పార్లమెంటులో ఎఫ్డిఐ ని పెంచుతూ బీమ చట్ట సవరణ బిల్లు తీసుకువస్తే సమ్మె కైనా వెనుకాడ బోమని హెచ్చరించారు అలాగే పాలసీ ప్రీమియం ల మీద కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ల నేతలు సుధీకర్ ,నిత్యానంద రెడ్డి, అక్బర్ బాషా, వసుప్రద, వారిజాతమ్మ, రత్నకిషోర్, జె.రఘు శ్రీనివాస్ కుమార్, జయచంద్ర, అప్పయ్య, చిన్నయ్య, శ్రీనివాసులు, యల్లయ్య,ఉద్యోగులు, పెన్షనర్లు, ఏజెంట్లు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

మదనపల్లె తహశీల్దార్‌గా ధనుంజయులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల తహశీల్దారుగా దనంజయులును నియమిస్తూ కలెక్టర్ శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ తహశీల్దారుగా పనిచేస్తున్న ఖాజాబీని నిమ్మనపల్లెకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మదనపల్లె తహశీల్దార్ నిమ్మనపల్లెకు, నిమ్మనపల్లిలో పనిచేస్తున్న తహశీల్దారును మదనపల్లెకు బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే మారిన తహశీల్దార్లు వారివారి స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.



విద్యార్థి అఖిలకు ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సభ్యులు

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అప్పకొండయ్యగారిపల్లి దళిత వాడకు చెందిన పేద విద్యార్థినికి రూ.13 వేల ఆర్థిక సాయం అందించారు. అప్పకొండయ్యగారిపల్లి దళితవాడకు చెందిన అఖిల కలికిరి హార్టికల్చర్ డిప్లమా చదువుతోంది. చదువులకు ఫీజులు కట్టుకోలేని స్థితిలో ఉందని తెలుసుకొని మానవతా సేవా సంస్థ లక్కిరెడ్డిపల్లి అధ్యక్షులు డాక్టర్ ఎండి సఫి నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర సెంట్రల్ కమిటీ సభ్యులు వై. ప్రసాద్ యాదవ్, చైర్మన్ ఎ.ఎస్.బాల సుబ్రహ్మణ్యం, కోచైర్మన్ ఎన్.శివశంకరరెడ్డి, డైరెక్టర్ రాజ రెడ్డి, మానవత సభ్యులు అహమ్మద్, నరేష్ కలిసి లక్కిరెడ్డిపల్లి జడ్‌పి బాలికల హైస్కూల్‌లో ఆర్థిక సాయం అందించారు. విద్యార్థినికి ప్రతి సంవత్సరం ఫీజు మొత్తాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు.

గంధం వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - చిన్నమండెం

మండల కేంద్రంలో వెలసిన హజరత్‌షా అలీ గంజే షహిద్ బాబా రహమతుల్లా అలైహి గంధం వేడుకలకు ప్రముఖులు హాజరయ్యారు. సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలక మండలి సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు వేర్వేరుగా పాల్గొన్నారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుసేన్ నుంచి ఆశీర్వాదం పొందారు. వారిని ఆయా పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో చిన్నమండెం వైస్ ఎంపిపి ఎజాస్ అలీ ఖాన్, సర్పంచ్ నజీర్ అహమ్మద్, షారుల్లా, మహమ్మద్ ఖాన్, కో - ఆప్షన్ గౌస్ సాబ్, మండల జెసిఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప,బురాన్ ఖాన్, యేహియా ఖాన్,సజ్జాద్, అజ్రూ, జహీర్, సాదిక్, ఖదీర్,సిబక తుల్లా ఖాన్, నాసర్‌తోపాటు తెలుగు యువత అధ్యక్షులు తౌహీద్‌ఖాన్, రాంప్రసాద్ నాయుడు,బాలచంద్ర యాదవ్, మయాన ఇర్షాద్‌ఖాన్, సైపుల్లా ఖాన్, రైస్‌మిల్ శంకర.తంజీర్ ఖాన్.వాజీద్ ఖాన్, రంతుల్లాఖాన్. తాజద్దీన్ ఖాన్, షాబుద్దీన్.బాబు. సిద్దయ్య, సాదిక్, ఫరూక్ పాల్గొన్నారు.



గంధం ఉత్సవాల్లో పాల్గొన్న టిడిపి నేత ప్రసాద్‌బాబు

ఎస్‌సి, ఎస్‌టిలకు ద్రోహం చేస్తే ప్రభుత్వాన్ని కూల్చేస్తాం

- 'దళిత దీక్ష'లో విసికె నేత పిటిఎం శివప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి ఎస్సీ, ఎస్టీలకు ద్రోహం చేస్తే, రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని కూల్చేస్తామని విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ తీవ్రంగా చెచ్చరించారు. మంగళవారం స్థానిక బెంగళూరు రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద 'దళిత దీక్ష' పేరుతో విసికె పార్టీ, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) సంయుక్తంగా నిరాహార దీక్ష చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ దీక్ష కొనసాగింది. శివప్రసాద్ చేపట్టిన దళిత దీక్షకు వైసిపి మదనపల్లె ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్, ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా విశ్వనాథనాయక్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, న్యాయవాది సోమశేఖర్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సాంబశివ, వాల్మీకి మహాసేన వ్యవస్థాపకుడు నల్లబోతుల సుదర్శన్ బాబు, రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపకుడు కోనేటి దివాకర్, శ్రీకృష్ణ దేవరాయ బలిజ సేవా సంఘం అధ్యక్షుడు నరేంద్రనాయుడు తదితరులు తమ శ్రేణులతో కలిసి దీక్షా శిభిరానికి విచ్చేసి, సంఘీభావం ప్రకటించారు. వైసిపి నేత నిస్సార్ మాట్లాడుతూ టిడిపి గత ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మోసపూరిత వాగ్దానాలు చేసి, వారి ఓట్లు కొల్లగొట్టిందని, గెలిచాక ఇచ్చిన హామీలు విస్మరించి, బడుగు బలహీన వర్గాలకు ద్రోహం చేసిందని విమర్శించారు. శివప్రసాద్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ద్రోహం చేయడంతో ఆగ్రహించిన వారు 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపునకు ఓట్లు వేశారని తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, రిజర్వేషన్లు పెంచాలన్నారురు. సంక్షేమ హాస్టల్లలో ఉండే విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో బాస్ నాయకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, మీడియా సెక్రటరీ టి.ఎ.పీర్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపాలెం రవిశంకర్ లతోపాటు బాస్, విసికె నాయకులు సొన్నికంటి రెడ్డెప్ప, వై.చిన్నా, తలారి కృష్ణ బురుజు జనార్ధన్, బురుజు రెడ్డిప్రసాద్, బైనేని సురేష్, చాట్ల కళ్యాణ్, నీరుగట్టి రాజేష్, వై.గంగాధర్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



నిరసన దీక్షల్లో పిటిఎం శివప్రసాద్, ఇతర నాయకులు

కులగణన దేశానికి ఆదర్శం : డిసిసి

ప్రజాశక్తి- రాయచోటి

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదో చారిత్రాత్మక ఘట్టం అని, ఈ సర్వే యావత్ భారతావనికి దిక్సూచి అని అన్నారు. దేశ భవిష్యత్ కోసం రాహుల్ గాంధీ దూరదృష్టికి ఇదొక నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 56 శాతం బిసిలు, 17 శాతం ఎస్‌సిలు, 10 శాతం ఎస్‌టిలున్నారని పేర్కొన్నారు. దాదాపు 90 శాతం వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలే ఉండటం విస్మయపరిచిన అంశమన్నారు. రిజర్వేషన్లు రద్దుకు కుట్ర అని బిజెపి తప్పు దారి పట్టిస్తోందిన్నారు. బిజెపి ఉచ్చులో మీరు పడవద్దని వెంటనే ఏపీలో కూడా కులగణన చేపట్టాలని తెలిపారు.



నాయీబ్రాహ్మణ సమితి నూతన కమిటీ సభ్యులు

నాయీబ్రాహ్మణ సమితి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఎపి నాయీబ్రాహ్మణ సమితి సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మంగళ ప్రభాకర్, ఉమ్మడి చిత్తూరు జిల్లాల కన్వీనర్ చింతకుంట కేశవులు ఆదేశాల మేరకు నాయీబ్రాహ్మణ సమితి తంబళ్లపల్లి నియోజకవర్గం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గం అధ్యక్షుడిగా బి.హరిచంద్ర ప్రసాద్, బి.కొత్తకోట మండల అధ్యక్షుడిగా జె.మల్లికార్జున, కార్యదర్శిగా బి.గణేష్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రమేష్, కమిటీ సభ్యులుగా బి.చంద్ర, బి.సూరి, బి.మణికంఠ, బి.వెంకటేష్, ఎ.విశ్వనాథ్, కె.భాస్కర్‌లను నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. నాయీబ్రాహ్మణుల అభివృద్ధి సంక్షేమం కోసం నూతన కమిటీ పనిచేయాలని సూచించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని, నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి కోసం అలుపెరగని కృషి చేస్తామని స్పష్టం చేశారు. మా ఎంపికకు సహకరించిన నాయీబ్రాహ్మణులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నిమ్మనపల్లె తహశీల్దార్‌గా ఖాజాబీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె



నిమ్మనపల్లె తహశీల్దార్‌గా ఖాజాబీని నియమిస్తూ కలెక్టర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కె.ధనుంజయులును మదనపల్లె తహశీల్దార్‌గా, మదనపల్లెలో పనిచేస్తున్న ఖాజాబీని నిమ్మనపల్లెకు బదిలీ చేశారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వారు నూతన మండలాల్లో తక్షణం బాధ్యతలు చేపట్టనున్నారు.

రేపు చేపల చెరువులకు బహిరంగ వేలం

ప్రజాశక్తి నిమ్మనపల్లి

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చేపల ఫలయం కోసం గురువారం రాచవేటివారిపల్లె పంచాయతీలోని 14 చెరువులకు బహిరంగ వేలం పాటను సర్పంచ్ కె.సుబ్రమణ్యం అధ్యక్షతన, ఇఒపిఆర్‌డి చలపతిరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మారెప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండాయన్నారు. రాచవేటివారిపల్లె సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం పాటలో ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆశక్తి కలిగిన వారు ముందుగా రూ.ఐదు వేలు డిపాజిట్ రుసుం కట్టి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. డిపాజిట్‌దారులు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని పేర్కొన్నారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చుపాట మొత్తాన్ని పాటదారుడు చెల్లించి తగిన రసీదు పొందాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నిరసన తెలుపుతున్న ఎన్‌ఎస్‌యుఐ నాయకులు

ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలి : ఎన్‌ఎస్‌యుఐ

ప్రజాశక్తి-పీలేరు

ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలని ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ, జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ డిమాండ్ చేశారు. ఎన్‌ఎస్‌యుఐ జాతీయ కమిటీ పిలుపుమేరకు మంగళవారం పీలేరు అంబేద్కర్ కూడలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక ఆర్‌ఎస్‌ఎస్‌ను వెంటనే నిషేధించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని గౌరవించడం తెలియదని, కేవలం మనస్మృతి మాత్రమే ఉన్నతమైందిగా పరిగణిస్తుందని తెలియజేశారు. దళితులు, వెనుకబడిన వర్గాల హక్కులను నిరాకరించడం, మహిళల హక్కులను వ్యతిరేకిస్తూ స్త్రీ వ్యతిరేక విధానాలను ప్రోత్సహిస్తుందని ఎద్దేవా చేశారు. ముస్లింలు, క్రిస్టియన్లపై ఆర్‌ఎస్‌ఎస్ దాడులను ప్రోత్సహించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. దశాబ్దాలుగా త్రివర్ణ పతాకాన్ని స్వీకరించేందుకు నిరాకరించిన చరిత్ర ఆర్‌ఎస్‌ఎస్‌దన్నారు. ప్రభుత్వ పాలన, విద్యలో ఆర్‌ఎస్‌ఎస్ చొరబాటుతో దేశ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. అలాంటి ఆర్‌ఎస్‌ఎస్‌ను రద్దు చేయని పక్షంలో దేశవ్యాప్తంగా ఎన్‌ఎస్‌యుఐ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ నాయకులు సాంబ, సాయి, రెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

బిసి కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన వర్గాల జీవనోపాధికి రుణాలు అందించడానికి దరఖాస్తులను కోరుతున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బిసిలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సంబంధించిన ఇడబ్ల్యూఎస్ వారికి, కాపు కార్పొరేషన్ ద్వారా కాపులకు, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు రుణ సదుపాయం పొందడానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. మండలంలో బీసీ కార్పొరేషన్ కింద 50 శాతం సబ్సిడీతో 45 యూనిట్లు మంజూరు కాగా, ఒక్కో యూనిట్ రూ.2 లక్షలుగా ఉందన్నారు. కాపు కార్పొరేషన్ కింద 14 యూనిట్లు మంజూరు కాగా రూ.2 లక్షలు వంతున ఇద్దరికీ, రూ.3 లక్షలు వంతున 7 మందికి, రూ.5 లక్షలు వంతున 5 మందికి మంజూరైనట్లు తెలిపారు. ఇబిసి కేటగిరీలో 2 యూనిట్లు మంజూరు కాగా, ఇద్దరికీ రూ.1.75వేలు, రెడ్డి సామాజిక వర్గానికి 2 యూనిట్లు మంజూరు కాగా అందులో ఇద్దరికీ రూ.1.75 మంజూరైనట్లు తెలిపారు. ఈ రుణాలను 50 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులు ఫుల్.. ప్రాంగణాలు నిల్

- క్రీడలపై మక్కువ ఉన్నా ప్రోత్సాహం కరువు
- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- మొబైల్ ఫోన్లపై మక్కువ పెంచుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంచుతాయి. ఆరోగ్యాన్ని నిలకడగా ఉంచుతాయి. స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి. కలివిడి మనస్తత్వాన్ని నేర్పిస్తాయి. కలుపు గోరుతనాన్ని దరిచేరుస్తాయి. గెలుపులో ఆనందాన్ని ఇస్తాయి. ఓటమి నుండి పాఠాలు చెబుతాయి. క్రీడలపై నీడలు పడుతున్నాయి. క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్ష ఉన్న అనేక మంది వెలుగులోకి రాలేకపోతున్నారు. మైదానాలు లేకపోవడం పిఇటిలు, పీడీలు తక్కువగా ఉండటం తగినంత ప్రోత్సాహం లేకపోవడం విరసి క్రీడాకారుల్లో ఉత్సాహం తగ్గిపోతుంది. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ తగిన ప్రాధాన్యత ప్రోత్సాహం లేక అనేక మంది విద్యార్థులు క్రీడాకారులుగా ఎదగలేక పోతున్నారు. క్రీడల నుండే గెలుపు ఓటములు జీవితాలను తీర్చిదిద్దుకుందామనుకునే యువ క్రీడాకారులకు ప్రోత్సాహం లేకపోవడం నిరుత్సాహాన్ని కలిగిస్తుంది. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తూ మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి. మానసిక వికాసానికి దోహదపడతాయి. విద్యార్థి దశనుంచే క్రీడలను అలవాటు చేయాలని సంకల్పముతో పీడీలను నియమించి ఒక పీరియడ్ ఆటలను ఆడించేవారు. ప్రతి ఉన్నత పాఠశాలకు పిఇటిలు ఉండేవారు. తాజా పరిస్థితులను గమనిస్తే ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో క్రీడల్లో ఆసక్తి చూపడం లేదు. చాలా క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో ఒక పీరియడ్ పిఇటిలచే ఆటలాడించాలని ఆదేశాలు జారీ చేయడం శుభ సూచకం. అర్హతలేని డ్రిల్ మాస్టర్లు చేసింది, ఆడిందే క్రీడ అన్నట్లుంది. ఈ పరిస్థితుల్లో క్రీడాకారులు ఎలా ఎదుగుతారు అన్నదే అర్థం కాని ప్రశ్న. చాలా పాఠశాలలో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా ఉత్తీర్ణతల గ్రేడింగ్ కోసం చదువులపై ఒత్తిడి పెంచుతున్నారు. బట్టీ చదువులు, పుస్తకాలతో కుస్తీలు, స్టడీ అవర్స్, యూత్ ట్యూషన్లు, హోంవర్క్‌లతో విద్యార్థులు కాలం గడిచిపోతుంది. విద్యార్థులు అధికంగా ఉండే ప్రయివేట్ పాఠశాలలకు క్రీడాస్థలం కొరత మామూలే. అంతస్తుల భవనాలలో నిర్వహించే పాఠశాలల్లో ఇరుకు గదులు, చీకటిలో విద్యాబోధన సాగుతుంది. కొద్దిపాటి కాళీ సమయం దొరికిన మొబైల్ వీడనంటుంది. విద్యార్థులు కూడా క్రీడలపై శ్రద్ధ చూపడం లేదు. కొందరి విద్యార్థులకు ఏఏ క్రీడలు ఉంటాయో కూడా తెలియని పరిస్థితి దాపురించింది. మండలంలో చాలా పాఠశాలలో యోగా, క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలుపుతున్నారు. 9వ తరగతి నుండి పై చదువులు చదువుతున్న కొంతమంది విద్యార్థిని విద్యార్థులు సెల్ ఫోన్లకే పరిమితం అవుతున్నారు. అరచేతిలో వైకుంఠం చూపెడుతున్న ఆ టచ్ ఫోన్లు విద్యార్థుల జీవితాలు నే మార్చి వేస్తుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి క్రీడలపై ఆసక్తి చూపి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ఆటల పీరియడ్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులు వేడుకుంటున్నారు.



అధ్వానంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని గ్రౌండ్

'కేన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్‌తో సాధ్యం'



వాల్మీకిపురం : కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ రవి కుమార్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

కేన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్‌తో సాధ్యం అవుతుందని స్థానిక ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ రవి కుమార్ అన్నారు. మంగళవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనశైలి, ప్రవర్తనతో క్యాన్సర్‌ను నియంత్రణ చేయవచ్చునన్నారు. గత నవంబర్ 15 నుంచి ఇంటింటి కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుట్కా, పొగాకు, మద్యం, ఎక్కువగా గర్భ నిరోధక మాత్రలు వాడడం, ఇన్‌ఫెక్షన్, వ్యాధి నిరోధక శక్తి చాలా తక్కువ ఉండడం, ఊబకాయం వంటి వాటి వలన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సోని, శివాని, హిమబిందు, హర్షిత, విక్రాంత్, ఆసిఫ్, టిబి సూపర్‌వైజర్ నాగిరెడ్డి, హెడ్‌నర్స్ గోవిందమ్మ, సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** కేన్సర్ వ్యాధి పట్ల గ్రామీణ ప్రాంతాలను ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులు మల్లికార్జున, కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడ, పాపిరెడ్డిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించిన ఆశాడే సందర్భంగా ఆశ వర్కర్లకు కేన్సర్ వ్యాధి పట్ల అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్, జోహార్ బాబు, హెల్త్ సూపర్వైజర్ రామకృష్ణమ్మ ,వెంకటేశ్వరరావు, ఎంపిహెచ్ఒ జయరామయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **కంభంవారిపల్లి :** ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కంభంవారిపల్లె మండలం గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రేష్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి భాగ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ నర్స్ రమాదేవి, పర్యవేక్షకులు రుక్మిణి పురుషోత్తం, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ప్రాథమిక దశలో గుర్తిస్తే కేన్సర్ వ్యాధిని నివారించవచ్చునని బి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ హసీనా పర్వీన్ పేర్కొన్నారు. పిహెచ్‌సిలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలోని ఓబిలి గ్రామానికి చెందిన ఎస్.ప్రవీణ్ అనే యువకుడికి కేన్సర్ వ్యాధి రావడంతో చికిత్సకు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో అతని మిత్రులు లయన్స్ క్లబ్‌నకు తెలియజేసి రోజువారి మందుల కొరకు కొంత ఆర్థిక సహాయం చేయమని తెలిపారు. ఈ విషయంపై క్లబ్ మెంబర్స్ తక్షణమే స్పందించి ప్రవీణ్‌కు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.పది వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో విభా ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయభాస్కరరావు, లయన్ మన్నెం రామమోహన్, డాక్టర్ బచ్చు జయ భాస్కరరావు, బెటాలియన్ ఎస్ఐ మన్నెం రామమోహన్, లయన్ కుర్రా మణి యాదవ్, కొత్తపల్లి రాజాచారి, దాసరి నరసింహులు, మోడపోతుల రాము, గంధం గంగాధర్, గుండు సురేష్ పాల్గొన్నారు.



కలకడ : కేన్సర్ వ్యాధి అవగాహనపై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకొని తద్వారా ఆరోగ్యవంతంగా జీవించాలని సురక్ష లైఫ్ కేర్ సొసైటీ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిప్పిలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రజలకు పోషక సామర్థ్యంపై వైద్య శిబిరం నిర్వహించి నామమాత్రపు రుసుంతో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మనిషి శరీరంలో పోషక సామర్థ్య పరీక్షలు ప్రయివేట్ ల్యాబ్‌లలో చేసుకోవాలంటే రూ.1500 నుండి రూ.2000 వరకు ఖర్చవుతుందని కానీ తమ సొసైటీ ద్వారా కేవలం రూ.70కే చేస్తున్నామన్నారు. ఈ పరీక్ష చేసుకోవడం ద్వారా మన శరీర అవయవాల పనితీరును తెలుసుకోవచ్చని, అందుకు అనుగుణంగా ఆహారాన్ని తీసుకుంటే భవిష్యత్తులో అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చునన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టిడిపి యువ నాయకులు బీదం గురునాథ్ యాదవ్ మాట్లాడుతూ పోషక విలువలపై చిప్పిలి నందు వైద్య శిబిరం నిర్వహించడం సంతోషకరమన్నారు. సురక్ష లైఫ్ కేర్ సొసైటీ వారు ప్రజల ఆరోగ్యానికి సంబంధించి అతి తక్కువ ధరకే పరీక్షలు నిర్వహించి, మందులను సైతం తక్కువ ధరలకే అందజేస్తుండడం అభినందనీ యమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ మండల కో-ఆర్డినేటర్ డి.పరిమళ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ భార్గవి, వాలంటీర్లు వసుధ, మహేశ్వరి, స్థానిక టిడిపి నాయకులు నయాజ్, షాహిద్, బావాజాన్, నవీన్, రజినీ కుమార్, కిరణ్, ఖాదర్ పాల్గొన్నారు.

మల్లయ్యకొండ ఆదాయం రూ.6.64 లక్షలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి హుండీ ద్వారా 6.64 లక్షలు ఆదాయం ఇచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ శశి కుమార్ తెలిపారు. మంగళవారం భక్తులు హుండీ ద్వారా చెల్లించిన కానుకలను లెక్క కట్టారు. ఈ మూడు నెలల కాలవ్యవధిలో భక్తులు చెల్లించిన కానుకల ద్వారా రూ.6,64,916 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒ మునిరాజు కూటమి నాయకులు ఉత్తమ రెడ్డి, సుధాకర్ రెడ్డి, గంగుల్ రెడ్డి, శివ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి-కలికిరి

యోగాతో ఆరోగ్యం కచ్చితంగా ఉంటుందని యోగా శిక్షకులు డాక్టర్ పివిఎస్ లక్ష్మి విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ఆమె ఎస్‌డబ్ల్యుఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో 12 రకాల యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి దైనందిన యాంత్రిక జీవితానికి అలవాటు పడి ఆటుపోట్లను ఎదుర్కొంటున్న యువతకు బంగారు భవిష్యత్తుకు బాటవేసేందుకు రథ సప్తమి సందర్భంగా ఆమె తమ శిష్యురాలు ప్రసన్న, న్యాయ సలహాదారు డాక్టర్ రాయల సుధాకర్‌లతో కలిసి కళాశాలకు విచ్చేసి ఆసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు చేయించారు. ఒక్కొక్క ఆసనం వేయిస్తూ వాటి ప్రయోజనం గురించి క్షుణ్ణంగా విశదీకరించారు. శిక్షణ కోర్స్‌లో చేరి పరిపూర్ణమైన శిక్షకులుగా కావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ అంజలి దేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి కలకడ

మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఎంపిడిఒ అబ్దుల్ రహీం తనిఖీ చేశారు. కలకడ, బాలయ్యగారిపల్లి పంచా యతీలలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు నిర్వహించి స్థితిగతులపై ఆరాధిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో చిన్నారులకు ఇస్తున్న పౌష్టిక ఆహారం తనిఖీలు నిర్వహించి వారికి అందించే ఆహార పదార్థాలను పనికి నిర్వహించి రికార్డును సచివాలయ రికార్డులను సిబ్బంది హాజరు పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చిన్నారులు పట్ల శ్రద్ధ చూపి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం బాలింతలు గర్భిణస్త్రలకు బాల అమృతం, కోడి గుడ్డు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ నాగమణి నాయక్, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.


అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పొన్నేటి పాలెం పంచాయితీ, పిచ్చలవారిపల్లికి చెందిన రైతు నరసింహులు (60)కి ఊరికి సమీపంలో వ్యవసాయ పొలం ఉంది. కొన్నేళ్ళుగా పొలానికి దారి సమస్యతో ఇబ్బంది పెడుతున్నాడు. అనేక మార్లు రెవెన్యూ అధికారులకు దారి సమస్య పరిష్కరించాలని వినతులు ఇచ్చినా స్పందన కరువైంది. పోవడమే పోలీసులను ఆశ్రయించినా దారి సమస్య పరిష్కారం అవ్వలేదు. రైతు నరసింహులుకు పొరుగు పొలానికి చెందిన రైతుతో తరచూ గొడవలు పడాల్సి వస్తోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి పొలం దగ్గర ఒంటరిగా ఉన్న రైతు నరసింహులు ప్రత్యర్థి రైతు పొలంలోని అల్ల నేరేడు చెట్టుకు ఉరికి వేలాడుతూ కనిపించడాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సిఐ కళా వెంకటరమణ సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైతు నరసింహులును ప్రత్యర్థి పొలానికి చెందిన వారే చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతుని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు మృతుని కుటుంబీకుల ఫిర్యాదుతో అనుమానస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. రైతుది ఆత్మహత్య.. లేక హత్య.. అన్నది డాక్టర్లు పోస్ట్ మార్టం నివేదిక ఆధారంగా తెలుస్తుందని సిఐ తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట



పుస్తకాలు, పలకలు అందజేస్తున్న బాలాజీ

మండల పరిధిలోని కేతరా జుపల్లెలోని అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు పంజగల బాలాజీ, జగదీశ్వరి దంపతులు తమ పిల్లలు హన్విక శ్రేయోశ్రీ, దిశాన్ కార్తికేయ అక్షరాభ్యాస సందర్భంగా 25 పలకలు, బలపాలు, స్వీట్లు, ఎలిమెంటరీ స్కూల్ పిల్లలు 35 మందికి రాత పుస్తకాలు, పెన్సిల్లు, పెన్నులు ఉచితంగా అందజేశారు. తొలుత వారు తమ పిల్లల అక్షరాభ్యాసం సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో సరస్వతీ పూజ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రం కార్యకర్త ఎస్.సరోజమ్మ, ఎలిమెంటరీ స్కూల్ ఉపాధ్యాయుడు శివ పిల్లలకు పుస్తకాలు అందించిన వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఉరుసు ఉత్సవానికి సిద్ధమవుతున్న హజ్రత్ ఖ్వాజాపీర్ మస్తాన్‌వలి దర్గా

రేపటి నుంచి ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఈ నెల 7వ తేదీ నుంచి పట్టణంలోని హజ్రత్ ఖ్వాజాపీర్ మస్తాన్ వలి దర్గా ఉరుసు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు దర్గా అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. 7వ తేదీ శుక్రవారం గంధం, ముషాయిరా, 8వ తేదీ శనివారం ఉరుసు, ఖవాలీ, 9వ తేదీ ఆదివారం తహ్‌లీల్ ఫాతెహా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉరుసు ఉత్సవంలో హిందు, ముస్లిం, క్రైస్తవ సోదరులు కలిసి కట్టుగా పాల్గొని, ఉరుసు ఉత్సవాన్ని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

కడప-బెంగళూరు రైల్వే పనులు పునఃప్రారంభించాలి

ప్రజాశక్తి - వీరబల్లి

కడప - బెంగళూరు రైల్వే పనులు పునః ప్రారంభించాలని ఎఫ్‌ఆర్‌డిఎస్ చైర్మన్ రాజశేఖర్‌రాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2008-2009లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిందన్నారు. 2010లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం వాటాతో నిధులు మంజూరు చేసి ప్రారంభించిందన్నారు. 2010లో శంకుస్థాపన అనంతరం 2019 వరకు అప్పటి కేంద్ర ప్రభుత్వంలో రూ.320 కోట్లతో పెండ్లిమర్రి వరకు పూర్తి చేసి, పెండ్లిమర్రిలో రైల్వే స్టేషన్ కూడా పూర్తి చేశారన్నారు. అప్పుడు ప్రాజెక్టు వ్యయం రూ.1780 కోట్లుగా భావించి ఆమోదం తెలిపారన్నారు. రూ.320 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇప్పటి రేట్లు ప్రకారం రూ. 4000 కోట్లు కేంద్ర బడ్జెట్ కేటాయిస్తే ఇప్పటి ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు పూర్తి కాగలదు అని ప్రజలు ఆశిస్తున్నారన్నారు. 2019లో వైఎస్ఆర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదు. రాష్ట్రం 50 శాతం నిధులు కేటాయించి నందున ప్రాజెక్టు నిలిచిపోయింది అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి లక్కిరెడ్డిపల్లి, రాయచోటి, రెండవ దశ పూర్తి చేసి గుర్రంకొండ, మదనపల్లి, కోలార్ మీదుగా బెంగళూరు మహానగరానికి ఇప్పటి ప్రభుత్వంలో పూర్తి చేయాలని రాయలసీమ ప్రజలు కోరుతున్నారు అన్నారు. రాయలసీమ ప్రాంతం హార్టికల్చర్ హబ్‌గా తయారైంది. మామిడి, బొప్పాయి, నిమ్మ, అరటి, కూరగాయలు, బెంగళూరుకు రవాణా చేసి ప్రజలు ఆర్థికంగా బలపడాలని రాయలసీమ ప్రజలు కోరుకుంటున్నారన్నారు.




రామాపురం : అన్నదానం చేస్తున్న దాతలు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం : మండలంలోని బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రాయచోటి పట్టణానికి చెందిన పి.మనోహర్, మనస్వి దంపతుల కుమారుడు పి.రెడ్డి దార్షిక్ మూడో పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం చేశరు. ఈ సందర్భంగా మనోహర్ దంపతులు మాట్లాడుతూ తమ కుమారుని పుట్టినరోజు వేడుకలు చివరి అంకంలో ఉన్న వృద్ధులకు అన్నదానం చేయడం మనసుకు సంతృప్తిని ఇచ్చిందన్నారు కార్యక్రమానికి ప్రేరేపించిన రాయచోటి పట్టణ లయన్స్ క్లబ్ వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తమ కుటుంబంలో వేడుకలు జరుపుకున్న ఇకపై ఇలాంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ మహమ్మద్, డిస్ట్రిక్ చైర్మన్ వి హరీష్ చంద్ర, దాతలు కుటుంబ సభ్యులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్నేహితుడు జశ్వంత్ జయంతి సందర్భంగా పట్టణంలోని జ్యోతి చౌక్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్నేహితులు అల్తాఫ్, గౌస్, శ్రావణ్, సయ్యద్, నరేష్, వినయ్, నరేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : ఎంవిఐ

ప్రజాశక్తి -నందలూరు : రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించాలని రాజంపేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా మండలంలోని నందలూరు షాదీ ఖానాలో మంగళవారం రహదారి భద్రత ప్రచారంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నూరు సిఐ బి.వి.రమణ మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమన్నారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణించరాదని పేర్కొన్నారు. రహదారి భద్రత చట్టాలను అతిక్రమించిన ఎడల మోటార్ వాహన చట్టం సెక్షన్ 86 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ శంకర్ నాయక్, వాహనదారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఐ వినోద్ కుమార్